

బుచ్చెయ్యపేటలో గాలీవర్షం

గురువారం భారీ ఈదురు గాలులతో వర్షం కురిసింది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు తీవ్రంగా ఎండకాసింది. 8లో



పోర్టులో రికార్డు స్థాయి లోడింగ్

విశాఖ: విశాఖ పోర్టు చరిత్రలో అత్యధికంగా 44,374 మెట్రిక్ టన్నుల ఐరెన్ ఓర్ పెల్లెట్స్‌ని గురువారం లోడ్ చేశారు.



అరకు కాఫీ అవుట్‌లెట్స్!

అరకు కాఫీ అవుట్‌లెట్స్ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన నగరాల్లో ప్రారంభించాలని గిరిజన సహకార సంస్థ భావిస్తోంది. 8లో

న్యూస్‌రీల్

క్రికెట్ స్కోరర్‌గా వేణుమాధవ్



కేఎస్‌వీపీ వేణు మాధవ్(ఫైల్)

తుమ్మపాల : సౌత్ ఏషియన్ ఒలింపిక్స్ క్రికెట్ మ్యాచ్‌ల స్కోరర్‌గా అనకాపల్లికి చెందిన క్రికెటర్ కేఎస్‌వీపీ వేణుమాధవ్ ఎంపికయ్యారు. అనకాపల్లిలో గుడ్ ఫ్రెండ్స్ క్లబ్, శారదా క్రికెట్ క్లబ్‌ల ద్వారా 28 ఏళ్లుగా క్రికెట్‌కు ఆయన విశేష సేవలందిస్తున్నారు. సింగపూర్ నుంచి ఒలింపిక్స్ స్కోరర్‌గా ఆయన ఎంపిక పట్ల పట్టణంలోని పలువురు అభినందనలు తెలిపారు.

ఎంపీ సత్యవతికి నీలిమ కృతజ్ఞతలు



ఎంపీ సత్యవతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నీలిమ దంపతులు

అనకాపల్లి టౌన్: ఎంపీ సత్యవతిని 'సాగా ఆఫ్ ది విమెన్ ఇన్ ఏటికొప్పాక'వీడియో రూపకర్త బోగాది నీలిమ గురువారం సత్కరించారు. నీలిమ దంపతులు ఎంపీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ మేధో సంపత్తి దినోత్సవం -2023లో తన వీడియో ఎంపిక పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఏటికొప్పాక మహిళలపై వీడియో రూపకల్పనలో ఎంపీ సహకారాన్ని మర్చిపోలేమన్నారు. 72 దేశాలకు చెందిన 180కి పైగా వీడియోల్లో పదింటిని ఎంపిక చేయగా అందులో మన దేశం నుంచి నీలిమ రూపొందించిన వీడియో స్థానం దక్కించుకుంది. వీటికి ప్రపంచ వ్యాప్తంగా ఓటింగ్ నిర్వహించగా ఏటికొప్పాక బొమ్మల తయారీ మహిళల స్ఫూర్తిదాయక వీడియో ద్వితీయ స్థానంలో నిలిచింది.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



తులసీ కిరణ్ (ఫైల్)

అనకాపల్లి టౌన్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో తక్కువ మార్కులు వచ్చాయని నాగవంశంవీధికి చెందిన కె.తులసీ కిరణ్ (17) ఇంటిలో ఎవరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్ఐ సత్యనారాయణ అందించిన వివరాలు... తులసీ కిరణ్ గాజువాకలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. 286 మార్కులతో పరీక్ష పాస్ అయినప్పటికీ తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపం చెంది గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు కిరణ్ తండ్రి రామారావు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

1 నుంచి వేసవి క్రీడా శిక్షణ

అనకాపల్లిటౌన్ : క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి నగిరెడ్డి సూర్యనారాయణ గురువారం తెలిపారు. నర్సీపట్నం మినీ ఎన్టీఆర్ స్టేడియంలో మే 1 నుంచి 31 వరకు బాక్సింగ్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, వుషూ, తైక్వాండో, ఆర్చరీ క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగలవారు సంప్రదించాల్సిందిగా కోరారు.

'జిల్లాలోనే పీఎఫ్ సమస్యల పరిష్కారం'



కె.పద్మావతికి పీఎఫ్ పుస్తకాన్ని అందిస్తున్న కృష్ణమోహన్

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న పీఎఫ్ సభ్యత్వం కలిగిన వ్యక్తులు తమ సమస్యలను నేరుగా చెప్పుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎఫ్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశాఖ పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.వి.కృష్ణమోహన్, జిల్లా ప్రజారవాణాశాఖ(ఆర్టీసీ) అధికారి కె.పద్మావతి తెలిపారు. స్థానిక ప్రజా రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో బుధవారం పీఎఫ్ అదాలత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ పీఎఫ్ ఖాతాదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో సభ్యత్వం కలిగిన ప్రతి వ్యక్తి విశాఖ పీఎఫ్ కార్యాలయానికి వచ్చి సమస్యలు విన్నవించుకునేవారని పేర్కొన్నారు. ఇక మీదట అలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రతి నెలా జిల్లాలో ఓ ప్రభుత్వ కార్యాలయంలో అదాలత్ ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో పీఎఫ్ కార్యాలయ సీనియర్ అకౌంటెంట్లు నారపిన్ని రమణ, పి.కామేశ్వరరావు, డిపో మేనేజర్ ఎన్.సుజాత, పీఎఫ్ ఖాతాదారులు పాల్గొన్నారు.

పాడి సంపదకు లోటు లేదురా..

- ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై వీర్య ఇంజక్షన్ల సరఫరా
- మేలు జాతి ఆడదూడల ఉత్పత్తే లక్ష్యం
- అందుబాటులో ఆధునిక లింగ నిర్ధారణ వీర్యనాళికలు
- దేశవాళీ ఎద్దులతో జత కట్టించి పాడి ఆవులకు గర్భధారణ
- రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పునరుత్పత్తి
- పెరగనున్న పాల దిగుబడి, ఆడ దూడల ఉత్పత్తి

పాడి సంపద అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. మూగ పశువులు, జీవాల ఆరోగ్య సంరక్షణకు 1962 సంచార అంబులెన్స్‌లను అందుబాటులోకి తీసుకొచ్చిన సర్కారు గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల్లో వెటర్నరీ అసిస్టెంట్లతో వైద్యసేవలందిస్తోంది. మూగజీవాలకు సరైన రోగ నిర్ధారణ చేసి, మరణాలను అరికట్టేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ల్యాబ్‌లను కూడా ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఆవులు, గేదెలు మేలు రకం ఆడ దూడలకు జన్మనివ్వడానికి, పాల ఉత్పత్తిని పెంచడానికి ఆర్బీకేల ద్వారా పాడి రైతులకు సబ్సిడీపై లింగ నిర్ధారిత వీర్యం ఇంజక్షన్లను అందిస్తోంది. తద్వారా పాల ఉత్పత్తిని, మేలు రకం ఆడ దూడల పునరుత్పత్తిని పెంచే దిశగా కృషి చేస్తున్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పథకాన్ని ప్రస్తుతం చురుగ్గా అమలు చేస్తున్నారు.



యలమంచిలిలో పాడి పశువులకు లింగ నిర్ధారిత వీర్యం ఇంజక్షన్లు వేస్తున్న వెటర్నరీ డాక్టర్

సాక్షి, అనకాపల్లి: జిల్లాలోని అన్ని మండలాల్లో పాడి సంపదను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. మేలు జాతి లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించి ఆవులు, గేదెలకు ఆడ (పెయ్య) దూడలను పుట్టించాలన్నది పశు సంవర్ధక శాఖ అధికారుల యత్నం. తద్వారా భవిష్యత్తులో మేలు జాతి పశువుల సంఖ్యను పెంచాలని వారు యోచిస్తున్నారు. అంతేగాకుండా రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా మేలు జాతి ఆడ దూడలను ఉత్పత్తి చేసే వీర్య కణాలను పశువులకు అందిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకూ 1,116 వీర్యనాళికలను వినియోగించారు.

రెండు వీర్య నాళికల ధర రూ.1350	
రైతు చెల్లించాల్సింది రూ.500	ప్రభుత్వ సబ్సిడీ రూ.850

లింగ నిర్ధారిత వీర్య కణాల రకాలివే..

పశువులకు అందించడానికి ప్రభుత్వం కొన్ని రకాల మేలు జాతి వీర్య కణాలను ఎంపిక చేసింది. విదేశీ గోజాతులైన జెర్సీ, హెచ్ఎఫ్, వాటి క్రాస్ బ్రీడ్, స్వదేశీ జాతులైన గిర్, సాహివాల్ తదితర రకాలు అందుబాటులో ఉన్నాయి. గేదెల్లో ముర్రా జాతికి చెందిన వీర్య నాళికలు అందుబాటులో ఉన్నాయి. లింగ నిర్ధారిత వీర్యంపై ఆసక్తి కలిగిన ఔత్సాహిక రైతులందరికీ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఇటీవల కాలంలోనే ఈనిన పశువులు, 1 నుంచి 3 ఈతల ఈనిన పశువులు, ఎటువంటి గర్భకోశ వ్యాధులు లేని పశువులను పథకానికి ఎంపిక చేస్తున్నారు.

రెండోసారీ మగ దూడ పుడితే నగదు రిఫండ్

ప్రభుత్వం పశువుల కృత్రిమ గర్భధారణకు అవసరమైన వీర్య నాళికలను సబ్సిడీపై పాడి రైతులకు అందజేస్తుంది. రెండు వీర్య నాళికల ధర రూ.1,350 కాగా.. రైతు రూ.500 చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన రూ.850లను ప్రభుత్వమే భరిస్తుంది. ఒకవేళ రెండు పర్యాయాలు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్ చేసిన తర్వాత కూడా పశువు గర్భం దాల్చకపోతే రైతు చెల్లించిన మొత్తం రూ.500 ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. మొదటిసారి, రెండోసారి కూడా మగ దూడ పుట్టినట్లయితే ఇంజక్షన్‌కు పాడి రైతు చెల్లించిన నగదు మొత్తం తిరిగి చెల్లిస్తారు.

ఆడ దూడల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యం



రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా ఆడ దూడల ఉత్పత్తిని గణనీయంగా పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీని ద్వారా లింగ నిర్ధారిత మేలు జాతి వీర్య కణాలను సబ్సిడీపై రైతులకు అందిస్తున్నాం. గ్రామాల్లోని పాడి రైతులకు సబ్సిడీపై వీర్య కణాల ఇంజక్షన్లు అందజేస్తున్నాం. మొదటి దశ పథకం అమలుకు ఇప్పటికే జిల్లావ్యాప్తంగా గ్రామాలను గుర్తించాం. ఆసక్తి కలిగిన రైతులు సంబంధిత పశుసంవర్ధక శాఖాధికారులను సంప్రదించాలి.

– డాక్టర్ ప్రసాద్‌రావు, పశు సంవర్ధకశాఖ జేడీ

బాల సదనానికి సదుపాయాలు

- సందర్శించిన కలెక్టర్
- రెండు వాషింగ్ మిషన్లు, ఆట సామగ్రి సమకూర్చనున్నట్టు వెల్లడి



కశింకోటలో బాల సదనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కశింకోట: బాల సదనాన్ని మరింత అభివృద్ధి చేసి సదుపాయాలు మెరుగుపర్చడానికి అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. కశింకోటలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాల సదనాన్ని గురువారం సందర్శించారు. సదనంలో ఉన్న సదుపాయాలు, పని తీరును పరిశీలించారు. మైదానాన్ని చదును చేయాలని, సౌకర్యాలను మరింత మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ 47 మంది బాలికలు చదువుతున్నారని ఆయనకు సిబ్బంది వివరించారు. మెనూ ప్రకారం భోజనం, టిఫిన్ పెడుతున్నారా.. లేదా? అని కలెక్టర్ చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. సదనానికి రెండు వాషింగ్ మిషన్లు, ఆడుకోవడానికి ఆట సామగ్రి సమకూర్చనున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

వేసవి నీటి ఎద్దడి నివారణ చర్యలు

- రూ.కోటీ 51 లక్షలతో ఇంటింటి కుళాయిలు, వాకింగ్ ట్రాక్ ప్రారంభం
- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు – మంత్రి గుడివాడ అమర్‌నాథ్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్ : వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా పూర్తి స్థాయిలో తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర వాణిజ్య, ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో గురువారం సాయంత్రం జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.కోటీ 51 లక్షలతో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలు, వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభించి, మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నీటి ఎద్దడి నివారణకు 200 కిలో లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ఇప్పటికే నిర్మించినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో అవినీతికి తావివ్వకుండా పేదలకు నేరుగా సంక్షేమ ఫలాలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనమందరం మద్దతు పలికి, వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్ననే సీఎంగా చేయాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. వలంటీర్ల ద్వారా పేదలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. దేశంలో పలు రాష్ట్రాలు ఏపీ పథకాల వైపు చూస్తున్నాయన్నారు. అభివృద్ధిలో రాష్ట్రం వెనుకంజలో ఉందంటూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రతిపక్షాలకు ఈ అభివృద్ధి కనిపించట్లేదా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వానికి విద్య, వైద్యం రెండు కళ్లు వంటివని అభివర్ణించారు. సంక్షేమ ఫలాలు, అభివృద్ధిలో రాష్ట్రం మొదటి స్థానంలో దూసుకుపోతోంది కాబట్టే మంత్రులు, ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నేతలు ప్రజల ముంగిటకు ధైర్యంగా వస్తున్నారని పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా పండగలా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ జనగణనపై పోరు బాట

- రేపు అనకాపల్లిలో బహిరంగ సభ
- ముఖ్యఅతిథిగా ఎంపీ ఆర్.కృష్ణయ్య
- కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ఎండగడతాం
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గానరేష్ యాదవ్



మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గానరేష్ యాదవ్

అనకాపల్లి టౌన్ : 'హలో బీసీ.. ఛలో అనకాపల్లి' బహిరంగ సభను స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గానరేష్ యాదవ్ చెప్పారు. రింగ్‌రోడ్డు మళ్ల బ్రదర్స్ ఫంక్షన్ హాల్లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘాల అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. అదేరోజు విశాఖ విమానాశ్రయం నుంచి అనకాపల్లి వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బీసీ ఓట్లతో గద్దెనెక్కిన కేంద్ర ప్రభుత్వం 2014లో జనగణనలో విభజన చేయడం జరుగుతుందని పార్లమెంట్ సాక్షిగా చెప్పి ఎనిమిది సంవత్సరాలు గడిచాయని, అయినా కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నారు. అడవుల్లో నివసించే జంతువులకు గణ విభజన ఉంది కానీ, బీసీలకు ఎందుకు ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. జూన్ నెలలో బీసీ జనగణనపై పార్లమెంట్‌ను ముట్టడిస్తామని చెప్పారు. దేశంలో 7 రాష్ట్రాల్లో బీసీ జనగణన జరుగుతోందని, ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీ విభజనకు మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో కమిటీని ఏర్పాటు చేసిందని చెప్పారు. సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ కశిరెడ్డి మురళీకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా బీసీలను ప్రభుత్వాలు ఓటు బ్యాంక్‌గానే ఉపయోగించుకున్నట్లు చెప్పారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం బహిరంగ సభ పోస్టర్‌ను నరేష్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘాల రాష్ట్ర యువజన అధ్యక్షుడు పిళ్లా నివాస్, రాష్ట్ర నాయకులు కె.లోవరాజు, కశిరెడ్డి నరసింగరావు, కాండ్రేగుల జగన్, మెలిపాక ఈశ్వరరావు, ఆళ్ల అనీల్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'లో వైవీ సుబ్బారెడ్డి

- నేడు పాయకరావుపేట నియోజకవర్గంలో పర్యటన



నక్కపల్లి/ఎస్.రాయవరం: నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించనున్న 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పాల్గొననున్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పథకాల గురించి ప్రజా స్పందన తెలుసుకుంటారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులు చెప్పిన విషయాలను ప్రజామద్దతు పుస్తకంలో నమోదు చేస్తారు. లబ్ధిదారుల మొబైల్ నుంచి 8296082960 నంబరుకు మిస్డ్ కాల్ ఇచ్చి, వారి అనుమతితో ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' అనే స్లోగన్ రాసి ఉన్న స్టిక్కర్లను అతికిస్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, దాడిశెట్టి రాజా, ప్రభుత్వ విప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చింతలపూడి వెంకటరామయ్య పాల్గొంటారు. ముందుగా నక్కపల్లి పార్టీ కార్యాలయం వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి నాలుగు మండలాలకు చెందిన ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఎమ్మెల్యే బాబూరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ కోరారు.

మిషన్ వాత్సల్యకు 4500 దరఖాస్తులు

- ఐసీడీఎస్ పీడీ ఉషారాణి వెల్లడి
- మారేపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ



కొత్తపెంటలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఐసీడీఎస్ పీడీ ఉషారాణి

దేవరాపల్లి : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ మిషన్ వాత్సల్య పథకం వర్తించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు అనకాపల్లి జిల్లా ఐసీడీఎస్ పీడీ జి.ఉషారాణి తెలిపారు. దేవరాపల్లి మండలంలో గురువారం ఆమె సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా సీడీపీవో వి.మంగతాయారుతో కలిసి మారేపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను, హాజరైన విద్యార్థుల సంఖ్యను సరిచూశారు. స్టాక్ రికార్డులు, సరుకుల నిల్వలను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారులను ఆటపాటలతో ముచ్చటించారు. అంతకు ముందు కొత్తపెంటలో స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావుతో కలిసి నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. దేవరాపల్లిలో కూడా అంగన్‌వాడీ సెంటర్–6కు భవన నిర్మాణానికి స్థల పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మిషన్ వాత్సల్య పథకానికి ఇప్పటి వరకు 4500 దరఖాస్తులు వచ్చాయని, అర్హులు ఇంకా మిగిలి ఉంటే నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏడాది నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలు ఈ పథకానికి అర్హులని, ఇంటిలో ఇద్దరు పిల్లలకు వర్తిస్తుందన్నారు. పిల్లలు తప్పని సరిగా చదువుతూ ఉండాలని, ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటే ఈ పథకం వర్తించదన్నారు. పథకం మంజూరైతే నెలకు రూ.4 వేలు చొప్పున బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు గ్రామాల్లో ప్రజలు సామాజిక బాధ్యతతో సహకరించాలని కోరారు.

నేడు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

విశాఖపట్నం: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఈ నెల 28న కౌన్సిల్ సమావేశం జరగనుంది. అజెండాలో 32 అంశాలు పొందుపరిచారు. ప్రధానంగా రూ.1.22 కోట్లతో ముడసర్లోవలో గ్యారెజ్ షెడ్, జీ–20 సదస్సులో భాగంగా అభివృద్ధి చేసిన సీతకొండ మలుపు ప్రాంతాన్ని వైఎస్సార్ వ్యూ పాయింట్‌గా నామకరణం, జోన్–3, 4లో వెండింగ్ జోన్లు గుర్తించి, డ్రాఫ్ట్ నోటిఫికేషన్ తదితర అంశాల ఆమోదంపై సభ్యులు చర్చించనున్నారు.

హైవేపై ఇష్టారాజ్యం

- ట్రాఫిక్ నిబంధనలు పాటించని డ్రైవర్లు
- మద్యపానానికి అడ్డాగా రోడ్ సైడ్ దాబాలు
- తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని పోలీసులు



రోడ్డుపక్కన నిలిపిన లారీని ఢీకొట్టిన కారు



నుజ్జయిన కారు ముందుభాగం

నక్కపల్లి: అనకాపల్లి నుంచి పాయకరావుపేట వరకు గ్రామీణ జిల్లాలో 60 కిలోమీటర్లున్న జాతీయ రహదారిపై నిత్యం ఎక్కడో ఓ చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. నిబంధనలు పాటించని డ్రైవర్లు, రోడ్లపై అడ్డంగా పార్కింగ్ చేసే వాహనదారులతో రోడ్డెక్కాలంటే భయం. హైవే పక్కన పార్కింగ్ లేకుండా ఏర్పాటు చేస్తున్న దాబాలు, కాఫీ హోటళ్లు ప్రమాదాలకు చాలా వరకు కారణ మవుతున్నాయి.

వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా..

- గత నెల 29న అర్ధరాత్రి పాయకరావుపేట, సీతారామపురం సమీపంలో దాబా, పెట్రోలు బంకు రోడ్డుపక్కన, ఏమాత్రం గ్యాప్‌లేని ప్రాంతంలో భారీ లారీ నిలిపారు. దీన్ని ఢీకొని గాజువాక ప్రాంతానికి చెందిన తల్లికొడుకులు దుర్మరణం పాలయ్యారు.
- వారం రోజుల క్రితం నామవరం జంక్షన్‌లో టీపాయింట్ ముందు ఆగి ఉన్న కారును లారీ ఢీకొనడంతో, కారు ముందు కొద్ది దూరంలో నిలుచున్న నామవరానికి చెందిన వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు.
- ఉద్దండపురం, గొడిచర్ల, ఒడ్డిమెట్ట, వేంపాడు ప్రాంతాల్లో గడచిన 3 మాసాల వ్యవధిలో జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు మరణించగా, 20 మంది వరకు గాయపడ్డారు.
- 2020 జనవరి నుంచి 2022 మే వరకు 1767 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో నేషనల్ హైవేపై 737 ప్రమాదాలు సంభవించాయి.

నిర్లిప్తంగా హైవే గస్తీ

రోడ్డుపక్కన భారీ వాహనాలను గమనించి చర్యలు తీసుకోవాల్సిన హైవే పెట్రోలింగ్ వాహన సిబ్బంది ఎక్కడో ఒక ప్రాంతానికే పరిమితమవుతున్నారన్న ఆరోపణలున్నాయి. తమ కళ్లముందే ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడాన్ని వారు సీరియస్‌గా తీసుకోవడం లేదు. దీంతో లారీ డ్రైవర్లు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. టోల్‌గేట్ పరిసర ప్రాంతాలు దాబాలు, పెట్రోలు బంకుల వద్ద రాత్రి సమయాల్లో రోడ్డుపక్కన వాహనాలు ఎక్కువగా నిలుపుతున్నారు. నిబంధనల ప్రకారం రాత్రి 11 గంటలు దాటితే హైవేను అనుకున్న హోటళ్లు, దాబాలను మూసేయాలి. తెల్లవార్లు తెరిచే ఉంటున్నాయి. మందుబాబులకు దాబాలే అడ్డాలుగా మారుతున్నాయి. రోడ్డుప్రమాదాల నియంత్రణకు ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా, క్షేత్ర స్థాయిలో అమలు చేయాల్సిన సిబ్బందిలో నిర్లిప్తత వల్లే ప్రమాదాల నియంత్రణ సాధ్యం కావట్లేదన్న ఆక్షేపణలున్నాయి.

కేసులు నమోదు చేస్తున్నాం



రోడ్డుప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. తరచూ ప్రమాదాలు సంభవించే ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలు కఠినంగా అమలు చేస్తాం. హైవే వెంబడి దాబాలపై దృష్టిపెడతాం. హైవే గస్తీని అప్రమత్తం చేశాం. నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు కూడా నమోదు చేశాం.

– అప్పలరాజు, సీఐ, పాయకరావుపేట

క్లుప్తంగా

పిడుగుపాటుకు ఆవు మృతి



మృతి చెందిన ఆవు

కె.కోటపాడు : మండలంలో గవరపాలెం శివారు భూమిరెడ్డిపాలేనికి చెందిన భూమిరెడ్డి రాముకు చెందిన ఆవు పిడుగుపాటుకు గురై గురువారం సాయంత్రం మృతిచెందింది. మండలంలో సాయంత్రం పిడుగులతో కూడిన భారీ వర్షం పలు గ్రామాల్లో కురిసింది. రాముకు ఆవును కల్లం వద్ద గల చెట్టు కింద కట్టి ఉంచగా ఇదే సమయంలో ఉరుములతో కూడిన పిడుగు చెట్టుపై పడింది. దీంతో చెట్టు కింద ఉన్న ఆవు పిడుగుపాటుకు గుకూ అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు రూ.50వేలు విలువ చేస్తుందని బాధిత రైతు తెలిపారు.

సర్కారు కళాశాలల హవా



తేజశ్వని రమ్యశ్రీ ఎల్లంశెట్టి రాణి సుంకర ధనలక్ష్మి మడిసి నాగమ్మ పత్తి లత

- వడ్డాది కేజీబీవీలో 91 శాతం ఉత్తీర్ణత

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలలు అద్భుతమైన ఫలితాలు సాధించాయి. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఉత్తీర్ణత సాధించి ఆశ్చర్యపరిచాయి. వడ్డాది కేజీబీవీ 91 శాతం, రావికమతం మండలం మరుపాక మోడల్ స్కూలు 76 శాతం ఫలితాలు సాధించాయి.

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 36 మంది పరీక్షలు రాయగా 33 మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కంటే ఈ ఏడాది 91 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ఎల్లంశెట్టి రాణి 1000/964 మార్కులు సాధించి కాలేజీ టాపర్‌గా నిలిచింది. సుంకర ధనలక్ష్మి 963, అద్దెపల్లి ఝాన్సీ 958, గాడి భారతి 958 మార్కులు సాధించారు. 13 మంది విద్యార్థినులు 900పైగా మార్కులు సాధించి 91 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో గతేడాది కంటే ఈ ఏడాది 69 శాతం ఉత్తీర్ణత వచ్చింది. 38 మందికి గాను 26 మంది ఉత్తీర్ణత సాధించారు. మాడిసి నాగమ్మ 440/415, పత్తి లత 410, నైదాన జ్యోతి 405 మార్కులు సాధించారు. పాఠశాలలో అధిక శాతం ఉత్తీర్ణత సాధించడంపై జిల్లా, మండల విద్యాశాఖాధికారులు, పలువురు నాయకులు విద్యార్థినులను, ప్రిన్సిపాల్ కె. అన్నపూర్ణను అభినందించారు.

మోడల్ స్కూల్‌లో 76 శాతం ఫలితాలు

రావికమతం: ఇంటర్ ఫలితాల్లో మరుపాక మోడల్ స్కూల్ సత్తా చాటింది. గతేడాది సెకండియర్ ఫలితాల్లో 46 శాతం రాగా, ఈ ఏడాది 76 శాతం ఫలితాలు వచ్చాయి. ఈ ఏడాది 87 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 66 మంది పాసయ్యారు. మొదటి సంవత్సరం గతేడాది 35 శాతంకాగా, ఈ ఏడాది 104కు 62 మంది పాసై 60 శాతం ఫలితాలు సాధించారు. ఫస్టియర్‌లో కె.తేజస్విని 454 ,ఆర్.రమ్యశ్రీ 437 మార్కులు, సెకండియర్‌లో కె.భవానీశంకర్ 944, బి.గిరిజ 934 మార్కులు సాధించారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సత్యసునీల్ పేర్కొన్నారు.

భగీరథుడి స్ఫూర్తితో ప్రయత్నించాలి

- భగీరథ మహర్షి జయంతి వేడుకల్లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



భగీరథ మహర్షి జయంతి వేడుకల్లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఎలాంటి కార్యక్రమాన్ని మొదలుపెట్టినా విజయం సాధించేంత వరకు పట్టుదలతో పని చేయాలని భగీరథ మహర్షి నుంచే మనం తెలుసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సూచించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన భగీరథ జయంతి కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి అంజలి ఘటించారు. భగీరథుడు ఎన్నో ప్రయత్నాలు చేసి గంగను భూమికి తీసుకువచ్చారన్నారు. అదే స్ఫూర్తితో సమాజానికి మేలు చేసేందుకు ప్రయత్నం చేయాలన్నారు. ప్రభుత్వం వెనకబడిన వర్గాల వారి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. సగర కుల యువత అభివృద్ధికి వృత్తివిద్యా శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్ కుమార్ భగీరథుని వృత్తాంతాన్ని వివరించారు. సగర కులాన్ని బీసీ–డీ నుంచి బీసీ–ఏకు మార్పు చేసేందుకు తనవంతు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో పి.వెంకటరమణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, బీసీ సంక్షేమ అధికారి కె.రాజేశ్వరి, ఉమ్మడి జిల్లా సగర సంఘం అధ్యక్షుడు గుర్రం నూకరాజు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శశి విద్యార్థుల సత్తా

తగరపువలస : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో సంగివలస శశి క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటారని చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో బి.సాయిప్రణీత 988, కె.తేజభరత్ 987, ఇ.గౌతమ్, కె.వి.ఎస్.చైతన్య, పి.నాగసాయి నిఖిత, బి.చరణ్‌లు 986 చొప్పున మార్కులు సాధించారన్నారు. 980కు పైగా మార్కులు 37 మంది, 970కు పైగా మార్కులు 91, 950కు పైగా మార్కులు 62 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను వై.ప్రశాంతి, నాగసాయిరామ్, పి.పూజితరామ్, సిహెచ్ హరిసాత్విక, పి.వి.వర్ధన్ 465 మార్కుల చొప్పున సాధించారన్నారు. 460కు పైగా మార్కులు 85 మంది, 450కు పైగా 218 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను కేటీ షణ్ముఖ శ్రీ, బి.శ్రీవల్లి, వై.తేజశ్రీ 435 చొప్పున మార్కులు సాధించారన్నారు. 430కు పైగా మార్కులు 19 మంది, 400కు పైగా 81 మంది విద్యార్థులు సాధించి సత్తా చాటారన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ అభినందించారు.

అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షుడిగా పెదబాబు

అనకాపల్లి టౌన్: ది అనకాపల్లి మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొణతాల లక్ష్మీనారాయణరావు,(పెదబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కూరగాయల మార్కెట్ వర్తక సంఘం కార్యాలయంలో అనకాపల్లి వర్తక సంఘం, అనుబంధ సంస్థల ఎన్నికలు గురువారం జరిగాయి. కార్యదర్శిగా తమ్మిన రఘుబాబు, కోశాధికారిగా పెంటకోట వెంకట రామారావు(శ్రీను) ఎన్నికయ్యారు. అనుబంధ సంస్థలైన ఎ.ఎం.ఎ.వి.ఎం ఆస్పత్రి అధ్యక్షుడిగా ఆళ్ల సత్యప్రసాద్, కార్యదర్శిగా కోలపర్తి కన్నబాబు, కోశాధికారిగా పాలవర్తి వెంకటేశ్వరరావు, ఎ.ఎం.ఎ.ఎల్ కళాశాల అధ్యక్షుడిగా కొల్లూరు ఎస్.ఎన్.మంగరాజు, కరస్పాండెంట్‌గా దాడి శ్రీనివాసరావు, ఎ.ఎం.ఎ.ఎ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ అధ్యక్షుడిగా కె.నారాయణరావు, కరస్పాండెంట్‌గా కొణతాల శివకుమార్, ఎ.ఎం.ఎ.యు.పి. స్కూల్ అధ్యక్షుడిగా పెంటకోట ఉమామహేశ్వరరావు, కరస్పాండెంట్‌గా మళ్ల ఉషా సాగర్, కోశాధికారిగా తమ్మిన కన్నయ్య పంతులు, ఎ.ఎం.ఎ.ఐ.కె.ఎస్ పాలిటెక్నిక్ కళాశాల అధ్యక్షుడిగా కొణతాల బాలసుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్‌గా ఎ.ఆర్.ఎల్.నరసింగరావు, అనకాపల్లి వర్తక సంఘం కర్రి రమేష్ కల్యాణ వేదిక అధ్యక్షుడిగా దొడ్డి నూకఅప్పారావు, కార్యదర్శిగా బుద్ధ శ్రీనివాసరావు, వర్తక సంఘం అదనపు ఉపాధ్యక్షుడిగా శ్రీధరాల కృష్ణపేర్రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కమిటీ పదవీకాలం రెండేళ్లు పాటు ఉంటుందని వర్తక సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణరావు తెలిపారు.

త్వరలో వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీల ఏర్పాటు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిబాబా

పాయకరావుపేట: త్వరలో పార్టీ ప్రచార కమిటీలను నియమిస్తామని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా తెలిపారు. పట్టణంలో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన గురువారం పత్రికా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు ఆర్.ధనుంజయ్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో పార్టీ ప్రచార విభాగం కమిటీలను నియమిస్తామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, మండల స్థాయి అధ్యక్షులు ఉంటారన్నారు. జిల్లాలో గల 7 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను సంప్రదించి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ సలహాలు సూచనలను పరిగణనలోకి తీసుకొని కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కమిటీల్లో కష్టపడి పనిచేసేవారికి, యువతకు, మహిళలకు ప్రాధాన్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 90 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. నవరత్నాలను అమలు చేసి అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్లలా భావించి పాలన సాగిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని ఈ విషయాలను ప్రజలకు వివరించడానికి ప్రచార కమిటీలను వేసి పార్టీ కేంద్ర కార్యాలయానికి జాబితాలను పంపిస్తామని చెప్పారు.

బుచ్చెయ్యపేటలో గాలీవర్షం

- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



పిడుగుపాటుకు మృతి చెందిన ఆవు వద్ద విలపిస్తున్న రైతు నానాజీ

బుచ్చెయ్యపేట : మండలంలో గురువారం భారీ ఈదురు గాలులతో వర్షం కురిసింది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు తీవ్రంగా ఎండకాసింది. సాయంత్రం ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుని ఉరుములు,మెరుపులతో గాలి వర్షం కురిసింది. పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. పలు విద్యుత్ స్తంభాలు విరిగిపోగా వైర్లు,ఇన్‌స్టెంట్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గింది. పలు గ్రామాల్లో జీడిమామిడి కాయలు నేలరాలి రైతులకు నష్టం జరిగింది. భీమునిపట్నం, నర్సీపట్నం రోడ్డులో లోపూడి పామాయిల్ ఫ్యాక్టరీ దగ్గరలో సైనిక శిక్షణ కేంద్రానికి వెళ్లే విద్యుత్ లైన్‌పై తాడిచెట్టు విరిగిపడడంతో స్తంభాలు విరిగిపడ్డాయి. పిడుగుపాటుకు లోపూడి శివారు బంగారుమెట్టకు చెందిన బత్తుల నానాజీకి చెందిన పాడి ఆవు మృతి చెందింది. సుమారు రూ.70 వేలు ఆస్తి నష్టం జరిగినట్టు బాధిత రైతు వాపోతున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

క్షయ రోగులకు ఉచిత పౌష్టికాహారం

- జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ శారదాబాయి



రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న జిల్లా టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ శారదాబాయి

నర్సీపట్నం: క్షయ రోగులు త్వరగా కోలుకోవడానికి మందులతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నట్టు డిస్ట్రిక్ట్ లెప్రసీ ఎయిడ్స్, టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ శారదాబాయి తెలిపారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలోని టీబీ యూనిట్‌లో క్షయవ్యాధి రోగులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రభుత్వం సరఫరా చేసిన ఎనిమిది రకాలతో కూడిన పౌష్టికాహార కిట్లను 180 క్షయ రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యం లక్షలతో కూడిందన్నారు. పైసా ఖర్చు లేకుండా క్షయ వ్యాధి రోగులకు ప్రభుత్వం వైద్యం అందిస్తుందన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడటం ద్వారా వ్యాధి నయమవుతుందన్నారు. మధ్యలో మందులు నిలిపివేస్తే వ్యాధి ఎక్కువవుతుందన్నారు. రోగులకు పౌష్టికాహారం భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం చోడిపిండి, గోధుమపిండి, కందిపప్పు, వేరుశెనగ గుళ్ల, బెల్లం, మంచినూనె, కొమ్ముశనగలు, పెసరపప్పుతో కూడిన పౌష్టికాహార కిట్లును ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ ప్రశాంతి, యూనిట్ సూపర్‌వైజర్లు, ఫార్మసిస్ట్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి కేసులో ఒకరి అరెస్టు

పాడేరు రూరల్ : ఇటీవల జరిగిన ఓ అనుమానస్పద మృతి కేసును పాడేరు పోలీసులు చేధించారు. ఈ వివరాలను పాడేరు సీఐ సుధాకర్ గురువారం సాయంత్రం పాడేరులో విలేకరులకు వెల్లడించారు. ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీ చివుకుచింత గ్రామానికి చెందిన సమరెడ్డి ప్రీతి అనే మహిళ జి.మాడుగుల మండలం నేరోడువలస గ్రామానికి చెందిన లొంజ ఉద్రాక్ష హరి విజయ్‌ను 2014లో ప్రేమించి వివాహం చేసుకుంది. వీరికి ఓ పాప ఉంది. ప్రీతి తన భర్త, కుమార్తెతో కలిసి చోడవరంలోని మారుతీనగర్‌లో తన తండ్రి సమరెడ్డి శంకర్‌రావు ఇంటి వద్ద నివాసం ఉంటోంది. భార్యాభర్తలు ఇటీవల కొద్దికాలంగా తరచుగా ఫైనాన్స్ వ్యాపారం విషయమై గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 18న ఉదయం 7.30 గంటల సమయంలో ప్రీతి తన భర్త అనారోగ్యంతో ఉన్నాడని, పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేర్పానని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని పాడేరు ఎస్‌ఐకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ లక్ష్మణరావు దీనిపై అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పాడేరు సీఐ సుధాకర్, ఎస్‌ఐ లక్ష్మణరావు కేసును లోతుగా దర్యాప్తు జరిపారు. అనుమానితుల కాల్‌డేటాతో పాటు పోస్టుమార్టం తొలి రిపోర్ట్ ఆధారంగా కేసును ఛేదించారు. లొంజ ఉద్రాక్ష హరి విజయ్‌ను చోడవరంలోని మారుతీనగర్‌లోని వారి ఇంటి వద్ద ప్రీతి తండ్రి సమరెడ్డి శంకర్‌రావు, మరికొంత మందితో కలిసి హత్య చేసి ఎవరికీ అనుమానం రాకుండా పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేర్చి సాధారణ మరణంగా సృష్టించే ప్రయత్నం చేశారు. కానీ పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెల్లడి కావడంతో హత్య కేసుగా నిర్ధారించి ప్రీతి తండ్రి శంకర్‌రావును గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ సుధాకర్ తెలిపారు. పాడేరు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఈ కేసు తదుపరి దర్యాప్తును చోడవరం పోలీసులకు బదిలీ చేశామన్నారు.

గంజాయి కేసులో నిందితుడు అరెస్ట్



నిందితుడు కొటారి కామరాజు

కొయ్యూరు: గంజాయి రవాణా కేసులో సుమారు రెండేళ్లుగా పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసి గురువారం రాత్రి కోర్టుకు తరలించినట్లు అనకాపల్లి సీఐ ఎ.రవికుమార్ తెలిపారు. పాడేరు నుంచి తాళ్లపాలెం వైపు ఆటోలో 128 కిలోల గంజాయి తరలిస్తుండగా 2021 మే నెల 8న పట్టుకున్నామన్నారు. అప్పట్లో బుచ్చెయ్యపేట మండలానికి చెందిన ఆటో డ్రైవర్ నంబారు చిరంజీవిని అరెస్టు చేశామన్నారు. అదే కేసులో అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం సల్మరంగి గ్రామానికి చెందిన కొటారి కామరాజు (30) అప్పటి నుంచి పరారీలో ఉండగా కొయ్యూరు పోలీసు సిబ్బందితో కలిసి గురువారం అనకాపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టుకున్నామన్నారు. నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామన్నారు.


విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం



దగ్ధమైన తాటాకు ఇల్లును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

నాతవరం : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి తాటాకు ఇల్లు పూర్తిగా కాలి బూడిదైన ఘటన నాతవరంలో చోటు చేసుకుంది. వివరాలివి. నాతవరం గ్రామానికి చెందిన పోలిరెడ్డి సత్తిబాబు, రుత్తల సత్తిబాబు, రుత్తల లక్ష్మి కుటుంబాలు తాటాకు వాసా ఇంటిలో నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించడంతో ఇల్లంతా కాలిపోయింది. స్థానికులు నర్సీపట్నం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా, వాహనం వచ్చేలోపు ఇల్లంతా కాలిబూడిదైంది. ఆ సమయంలో ఇంట్లో వ్యక్తులు వివిధ పనులపై బయటకు వెళ్లడంతో ఇంట్లో వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దుస్తులు, నిత్యావసర వస్తువులు టీవీ, ఫ్రిజ్ ఇతర వస్తువులు పని రాకుండా మాడిపోయాయి. సర్వం కోల్పోడంతో బాధితులు భోరున విలపిస్తున్నారు. జరిగిన ప్రమాదంపై వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, వీఆర్వో బొత్సా శ్రీనివాస్ సంఘటన ప్రదేశాన్ని పరిశీలించారు. అగ్నిప్రమాదంలో నష్టం రూ.3 లక్షలకు పైగా ఆస్తి నష్టం ఉంటుందని భావిస్తున్నారు.


దోనె బోల్తాపడి మత్స్యకారుడి మృతి



అప్పారావు(ఫైల్)

రోలుగుంట : చేపల వేటకు వెళ్లి దోనె బోల్తా పడిన ప్రమాదంలో మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన కొమరవోలు అవలో గురువారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చేపల వేటతో జీవనోపాధి సాగించే కొమరవోలు గ్రామానికి చెందిన పడాల అప్పారావు, నక్క అగ్గిరాముడు వేర్వేరు దోనెల్లో కొమరవోలు ఆవలోకి దోనెపై చేపల వేటకు గురువారం సాయంత్రం వెళ్లారు. ఆ సమయంలో ఈదురు గాలులు వీచడంతో ఆవ మధ్యలోకి వెళ్లిన తరువాత దొనె బోల్తా పడి అప్పారావు నీటిలో పడిపోయాడు. ఈదుకుంటూ కొంతదూరం వచ్చిన అప్పారావు కాళ్లకు వల చుట్టుకోవడంతో ఈత కొట్టే అవకాశం లేక ఆ సమయంలో వీచిన గాలులు తట్టుకోలేక నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. కొంత సేపటికి అతని బావ మరిది నక్కా అగ్గిరాముడికి అప్పారావు కనిపించకుండా వల కనిపించడంతో వల లాగి చూడగా అప్పారావు చనిపోయి ఉన్నాడు. దీంతో ఈ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్లో ఆ రాత్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి సంఘటన స్థలానికి వచ్చి ప్రమాదానికి గల కారణాలపై స్థానికులను విచారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్టు విలేకరులకు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు.

నర్సీపట్నం మున్సిపల్ తాత్కాలిక చైర్మన్‌గా తమరాన



అప్పలనాయుడు

నర్సీపట్నం: స్థానిక మున్సిపల్ తాత్కాలిక చైర్మన్‌గా వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు నియమితులయ్యారు. ఇటీవల చైర్‌పర్సన్ పదవికి గుడబండి ఆదిలక్ష్మి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆమె రాజీనామాను మున్సిపల్ అధికారులు ఎన్నికల సంఘానికి నివేదించారు. తదుపరి చైర్మన్ ఎన్నికకు సంబంధించి ఆదేశాలు వచ్చేంత వరకు తాత్కాలిక చైర్మన్‌గా అప్పలనాయుడు వ్యవహరిస్తారని కమిషనర్ కనకారావు తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

అనకాపల్లిటౌన్ : గంజాయి కేసులో పరారైన ఇద్దరు నిందితులను గురువారం ఉదయం అనకాపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో అదుపులోనికి తీసుకుని కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు రూరల్ ఎస్‌ఐ సీహెచ్.నరసింగరావు చెప్పారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలు...ఈనెల 22 తేదీన మండలంలో బవులవాడ గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో 34 కిలోల గంజాయి తరలిస్తూ పరారైన తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన మోదెం సైలీస్(19), తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా శివనగర్‌కు చెందిన మజ్జిగ అజయ్(20) గురువారం అనకాపల్లి రైల్వే స్టేషన్ నుంచి పాడేరు వెళుతుండగా రైల్వే స్టేషన్ సమీపంలో అదుపులోనికి తీసుకున్నట్టు ఎస్‌ఐ చెప్పారు. ఈ మేరకు ఇద్దరినీ కోర్టులో హాజరుపర్చడం జరిగిందన్నారు.

ఎన్ఏవోబీని పరిశీలించిన ఎస్పీ

రాంబిల్లి: ప్రత్యామ్నాయ నావికా స్థావరం (ఎన్ఏవోబీ) ప్రాంతాన్ని ఎస్పీ మురళీకృష్ణ గురువారం పరిశీలించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా కొత్తగా అనకాపల్లి జిల్లాకు వచ్చిన ఎస్పీ తొలిసారిగా ఈ ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం రాంబిల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎస్‌ఐ దీనబంధుకు సూచించారు.

'లైంగికదాడి నిందితుడిని అరెస్టు చేయాలి'

చోడవరం రూరల్: చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధి వరహాపురం గ్రామంలో మహిళపై లైంగికదాడికి పాల్పడ్డ నిందితుడు యలమంచిలి చిన్నను తక్షణమే అరెస్టు చేయాలని సీఐటీయూ అనుబంధ మహిళా సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి ఆధ్వర్యంలో చోడవరంలో నిరసన చేపట్టారు. ఈ నెల 13న చోటు చేసుకున్న ఈ ఘటనలో చీడికాడ పోలీసులు నిందితుడిని స్టేషన్ బెయిల్‌పై వదిలిపెట్టారని ఆమె ఆరోపించారు. ఇప్పుడు తమకు ఆచూకీ లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి దేముడునాయుడు, ఎలమంచలి ఎర్రయ్య, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం ఎంఈవో శ్రీనివాసరావు మృతి



తగరపువలస: అనకాపల్లి జిల్లా చోడవరం ఎంఈవో నగిరెడ్ల శ్రీనివాసరావు (57) అస్వస్థత కారణంగా చికిత్స పొందుతూ నగరంలోని ఆస్పత్రిలో గురువారం సాయంత్రం చనిపోయారు. ఈయన స్వస్థలం జీవీఎంసీ భీమిలి జోన్ 3వ వార్డుకు చెందిన రాయపాలెం. ప్రస్తుతం భార్య, కుమారునితో కార్‌షెడ్ కూడలి సమీపంలో ఉంటున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధుల్లో చేరకముందు తగరపువలసలో వేలాది మందికి గణితంలో శిక్షణ ఇచ్చారు.

అరకు కాఫీ అవుట్‌లెట్స్!

- రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- అవుట్‌లెట్స్‌లో అందుబాటులో ఇన్‌స్టెంట్, ఫిల్టర్ కాఫీలు
- తొలివిడతగా విశాఖ పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు



సాక్షి, విశాఖపట్నం : సేంద్రీయ పద్ధతుల్లో తయారయ్యే అరకు కాఫీ అంటే తెలియనివారంటూ ఎవరూ ఉండరు. ఏజెన్సీలోని వాతావరణమే అరకు కాఫీ రుచికి ప్రధాన కారణమన్నది మెటరాలజీ విభాగ నిపుణులు తేల్చిచెప్పారు. ఇక్కడ పండే అరబికా రకం కాఫీ.. పారిస్, జపాన్, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్ దేశాల్లోని నగరాల ప్రజలూ దీని రుచికి సలాం కొట్టారు అందుకే.. 2018లోనే బ్రెజిల్, సుమత్రా, కొలంబోతో పాటు ఇతర దేశాల్ని వెనక్కు నెట్టేసి.. ప్రిక్స్ ఎపిక్యూర్–2018 పోటీల్లో అరకు కాఫీ బంగారు పతకాన్ని సాధించింది. ఇప్పుడు అరకు కాఫీ అవుట్‌లెట్స్ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రధాన నగరాల్లో ప్రారంభించాలని జీసీసీ భావిస్తోంది.

అన్ని కాఫీలకు దీటుగా..

ప్రస్తుతం కాఫీ అవుట్‌లెట్స్ నగరాల్లో పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్నాయి. కుంభకోణం, మద్రాస్ ఫిల్టర్ కాఫీ, కోయంబత్తూర్.. ఇలా విభిన్నమైన కాఫీ అవుట్‌లెట్స్ కనిపిస్తున్నాయి. వాటికి కాఫీ ప్రియుల నుంచి ఆదరణ విపరీతంగా ఉంటోంది. వాటన్నింటికంటే అద్భుతమైన రుచి ఉన్న అరకు కాఫీని కూడా అదే మాదిరిగా ప్రజలు ఆస్వాదించాలనే ఉద్దేశంతో అవుట్‌లెట్స్‌ని ఏర్పాటు చేయాలని జీసీసీ భావిస్తోంది. అరకు కాఫీ రుచిని అందరికీ అందించనుంది. ఇందుకోసం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో మొదటగా అరకు కాఫీ అవుట్‌లెట్స్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఫిల్టర్ కాఫీ, ఇన్‌స్టెంట్ కాఫీతో పాటు భిన్నమైన కాఫీ రుచుల్ని ఈ అవుట్‌లెట్స్‌లో అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే జీసీసీ కాఫీ అవుట్‌లెట్‌ని ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. అదే మాదిరిగా నగరాల్లోనూ సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా అవుట్‌లెట్స్‌ని సిద్ధం చేయనున్నారు. ఇందుకోసం స్థల అన్వేషణ మొదలుపెట్టాలని ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో జీసీసీ అధికారులు చర్చలు జరిపారు.

గిరిజనులకు ఉపాధి అవకాశాలు



అరకు కాఫీ అవుట్‌లెట్స్ ఏర్పాటుపై బోర్డు సమావేశంలో ప్రతిపాదనల్ని తీసుకొచ్చాను. దీనిపై అధికారులు చర్చలు జరిపారు. పైలట్ ప్రాజెక్టుగా విశాఖ నగరంలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం. ఇక్కడ విజయవంతమైతే రాష్ట్రంలోని ఇతర నగరాలకు విస్తరించనున్నాం. అవుట్‌లెట్స్ ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

– శోభా స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

క్లుప్తంగా

నేడు తాళ్లపాలేనికి వైవీ సుబ్బారెడ్డి

కశింకోట : మండలంలోని తాళ్లపాలేనికి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి రానున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు తెలిపారు. గ్రామంలో జరిగే ×జగనన్నే మా భవిష్యత్తు¤ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. ఆయనతోపాటు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కూడా హాజరుకానున్నట్టు వెల్లడించారు. వారు గ్రామంలో ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, స్థానికులు రావాల్సిందిగా కోరారు.

అంబేడ్కర్ గురుకుల విద్యార్థుల ప్రతిభ

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 61.6 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 73 మంది హాజరుకాగా, వారిలో 45 మంది ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు. ఎంపీసీ గ్రూపులో పి.లక్ష్మి 881 మార్కులు, బైపీసీలో ఎస్.సత్యశ్రీ 899 మార్కులతో కళాశాల నుంచి టాపర్లుగా నిలిచినట్టు వెల్లడించారు. ప్రథమ సంవత్సరంలో పరీక్షలకు 66 మంది విద్యార్థులు హాజరుకాగా 68.2 శాతంతో 45 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. ఎంపీసీలో కె.గాయత్రి 440/470 మార్కులు, బైపీసీలో బి.ప్రీతిజ్యోత్స్న 408/440 అత్యధిక మార్కులు సాధించారని పేర్కొన్నారు.

రెండు రోజులు విద్యుత్ అంతరాయం

అనకాపల్లిటౌన్ : మండలంలోని కొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్ల కింద జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం ఈ నెల 28, 29 తేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు విద్యుత్ శాఖ డీఈఈ కేఏ కోటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రెండు రోజులు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్టు వెల్లడించారు. కొత్తూరు, పిసినికాడ, మూలపేట, సత్యనారాయణపురం, సంపతిపురం, వేటజంగాలపాలెం, కుంచంగి, కూండ్రం, రొంగలివానిపాలెం, బీఆర్టీ గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 1,246 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,250	4,500
మొదటి రకం	3,990	4,250
రెండో రకం	3,560	3,970
మూడో రకం	3,440	3,550

అనకాపల్లి సినిమాలు

సిసు	రాజా
ఏజెంట్	సత్యనారాయణ స్క్రీన్-1
కలియుగ భగవాన్ (ఉదయం ఆట)	
రారా పెనిమిటి (3ఆటలు)	సత్యనారాయణ స్క్రీన్-2
పీఎస్-2	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
రుద్రుడు	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 73 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-40 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 323 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

విలీనంతో పెరిగిన పని భారం

అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయంపై ఒత్తిడి పెరుగుతోంది. జిల్లా కేంద్రంగా మారడం, గ్రామీణ ప్రాంతం విస్తరించడం, జీవీఎంసీ విలీన గ్రామాలతో మండల పరిధిలో జనాభా పెరిగింది. సమీప మండలాలు కశింకోట(42 వేలు), మునగపాక(40 వేలు), చోడవరం(55 వేలు), బుచ్చెయ్యపేట(40 వేలు), చీడికాడ(40 వేలు) సుమారుగా 50 వేల జనాభాకు అటూఇటుగా ఉన్నాయి. అనకాపల్లి మండల పరిధిలో మాత్రం జనాభా దాదాపు 2.35 లక్షలు. దీంతో కనీసం మరో రెండు తహసీల్దార్ కార్యాలయాల్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పెరిగింది.





బ్రిటీష్ కాలంనాటి తహసీల్దార్ కార్యాలయం (ఇన్‌సెట్) పిచ్చి మొక్కలతో కార్యాలయం బోర్డు

- మండల పరిధిలో 2.35 లక్షల జనాభా, 1.53 లక్షల ఓటర్లు
- అదనపు తహసీల్దార్ కార్యాలయాల ఏర్పాటుపై స్థానికుల అభ్యర్థన

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి పట్టణం, మండలం, జీవీఎంసీ విలీన గ్రామాలకు జనాభా ప్రాతిపదికన మరో రెండు తహసీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. పట్టణ, మండలం, జీవీఎంసీ విలీన గ్రామాల్లో సుమారుగా రెండు లక్షల 35వేల మంది జనాభా నివసిస్తున్నారు. లక్ష 53 వేల మంది ఓటర్లు ఉన్నారు. పట్టణ తహసీల్దార్ కార్యాలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. బ్రిటీష్ కాలంలో ఏర్పాటు చేసిన తహసీల్దార్ కార్యాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయ ఆవరణలో మండల పరిషత్, ఎంపీపీ, సబ్ ట్రెజరీ, జిల్లా డీఆర్‌డీఏ కార్యాలయాలు ఒకేచోట నిర్వహించడంతో వివిధ అవసరాల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

25 కి.మీ. పరిధి

అనకాపల్లిపట్టణం నుంచి చుట్టూ మండల పరిధి సుమారుగా 25 కిలోమీటర్ల మేర ఉంది. ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని పట్టణ ప్రజలకు అందుబాటులోనికి ఉంచి, మండలం, జీవీఎంసీ విలీన గ్రామాలకు వేర్వేరుగా రెండు తహసీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంపై ఒత్తిడి పెరిగి, సకాలంలో సేవలు అందని పరిస్థితి. ఎన్నికల సమయంలో ఈ ఇబ్బంది మరింతగా పెరుగుతోంది. సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటే.. సాధారణ సేవలకు కూడా ప్రజలు నిరీక్షించక తప్పని పరిస్థితి. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటికీ అప్పటికప్పుడే కొన్ని ధ్రువీకరణ పత్రాలు జతచేయాలి. దీంతో హడావుడి తప్పనిసరవుతోంది.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటై 11 ఏళ్లు

అనకాపల్లి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి సుమారు 11 ఏళ్లు అవుతోంది. జనాభా ప్రాతిపదికన మరో రెండు తహసీల్దార్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నేతలు గతంలోనే లిఖిత పూర్వక వినతులిచ్చారు. పట్టణ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు చాలా ఎక్కువగా ఏర్పడ్డాయి. విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయంపై ఒత్తిడి నెలకొంది. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్థాయిలోనే పలు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నా, వాటికి చాలా వరకు తహసీల్దార్ కార్యాలయం నుంచి అనుమతి తప్పనిసరి. దీంతో అత్యవసరంగా ధ్రువపత్రాలు కావాలనుకునేవారు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారు.

జనాభాకు తగ్గట్టుగా..



నా కుమారుడి కులధ్రువీకరణ సర్టిఫికెట్ కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పటికీ సకాలంలో రాలేదు. పాఠశాల యాజమాన్యం తక్షణమే కులధ్రువీకరణ పత్రాలు తీసుకురమ్మన్నారు. తెలిసిన వ్యక్తిచే తహసీల్దార్‌ను కలిస్తే, ఆయన చొరవతో వేగంగా వచ్చింది.

– మడపాల గణేష్, అనకాపల్లి

సచివాలయంలో దరఖాస్తు చేసినా..



ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు కుల ధ్రువీకరణ పత్రాలు అడుగుతున్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ సకాలంలో అందడం లేదు. సచివాలయాల్లో వివరాలు నమోదు చేసుకున్న తరువాత తహసీల్దార్ కార్యాలయం చుట్టూ మరోసారి తిరగాల్సి వస్తోంది.

– కె.శ్రీను, అనకాపల్లి

మెరుగైన సేవలు



తహసీల్దార్ కార్యాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నాం. పని ఒత్తిడి పెరిగిన మాట వాస్తవమే. అయినా ప్రజలకు నిర్ణీత గడువులో సేవలందించడంలో ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నాం. కార్యాలయ పరంగా ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా మమ్మల్ని సంప్రదించవచ్చు.

– గంగాధరరావు, తహసీల్దార్, అనకాపల్లి

పారిశ్రామిక హబ్‌గా నియోజకవర్గ అభివృద్ధి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్



రొంగలివానిపాలెంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్



కుంచంగి గ్రామంలో పాఠశాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : అర్హులైన లబ్ధిదారులందరికీ జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాలు మంజూరు చేస్తున్నామని, గృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని ఈ అవకాశాన్ని బడుగు, బలహీన వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని రొంగలివానిపాలెంలో గురువారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిపై గ్రామస్తుల్ని అడిగి తెలుసుకున్నారు.

సాంకేతిక కారణాలతో పథకాలు దక్కనివారు, దగ్గరలోని సచివాలయాల్లో మరోసారి నమోదు చేసుకోవాలని సూచించారు. నవరత్నాల రూపకర్త సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల మద్దతు రోజురోజుకు పెరుగుతోందని, ప్రతి పక్షాలను చాపచుట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక సదస్సులో నియోజకవర్గానికి రూ.1.21 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ వైఎస్సార్‌సీపీ

అనకాపల్లిటౌన్ : మండలంలోని కుంచంగి గ్రామంలో గురువారం సాయంత్రం పలు అభివృద్ధి పనులను రాష్ట్ర వాణిజ్య, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని కొనియాడారు. తొలుత నాడు-నేడు పథకం కింద రూ.23 లక్షలతో నిర్మించిన మండల ప్రాథమికోన్నత పాఠశాల భవనంతోపాటు, రూ.45 లక్షలతో చేపట్టిన డ్రైన్లు, రహదారులు, రొంగలివానిపాలెంలో రూ.10.43 లక్షలతో నిర్మించిన 20 కిలో లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంకును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకస్ యాప్‌లో ఎస్‌హెచ్‌జీల వివరాలు



లోకస్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం శ్రీనివాసరావు

కశింకోట : స్వయం సహాయక సంఘాలను దేశ వ్యాప్తంగా ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేలా 'లోకస్ యాప్' ద్వారా ఆన్‌లైన్ నమోదుకు సన్నాహాలు చేస్తున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. కశింకోటలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గురువారం లోకస్ యాప్‌లో స్వయం సహాయక సంఘాల వివరాలు నమోదు చేయడానికి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు స్వయం సహాయక సంఘాలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా పని చేస్తున్నాయన్నారు. ఇకపై దేశ వ్యాప్తంగా ఒకే విధానంలో పని చేసేలా స్వయం సహాయక సంఘాల వ్యక్తిగత వివరాలు, పొదుపు, రుణాలు, ఆర్థిక లావాదేవీలు తదితర వివరాలను లోకస్ యాప్ ద్వారా ఆన్‌లైన్ చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు రాష్ట్రానికే పరిమితమైన స్వయం సహాయక సంఘాల వివరాలు, కార్యకలాపాలు మొబైల్ యాప్ ద్వారా కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య కార్యదర్శి లక్ష్మి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

30న మహిళలకు ముగ్గుల పోటీలు

అనకాపల్లిటౌన్ : వాసవీ నవరాత్రుల్లో భాగంగా ఈ నెల 30న మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకుడు పిరాట్ల నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి 30 వరకు వాసవీ నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మన సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిఫలించేలా ఉత్సవ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. పోటీల్లో భాగంగా ముగ్గుల్ని వారి వారి స్వగృహంలో వేసి ఫొటోలు తీసి 8019508033 నంబర్‌కు వాట్సాప్ చేయాలని కోరారు.

డి పట్టా యజమానులకు న్యాయం చేయాలి

అనకాపల్లిటౌన్ : డీ ఫాం పట్టా భూ యజమానులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కన్వీనర్ పీఎస్ అజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణకు గురువారం వినతిపత్రం అందించారు. ఉమ్మడి విశాఖ జిల్లాగా ఉన్న సమయంలో అనకాపల్లి మండల పరిధిలో దళిత బహుజన పేదలకు ఇచ్చిన డీ ఫాం పట్టా భూములను ప్రభుత్వం ల్యాండ్‌పూలింగ్ స్కీం కింద జీవో నెం.72 ద్వారా సేకరించిందన్నారు. అలా సేకరించిన భూములకు ప్రభుత్వం కొన్ని నిర్దిష్టమైన హామీలతో లిఖితపూర్వకంగా డాక్యుమెంట్ ఇచ్చిందన్నారు. ఎకరా భూమి తీసుకుంటే 18 సెంట్ల భూమిని అభివృద్ధి చేసి, వ్యవసాయేతర భూమిగా మార్చి, పూర్తి జిరాయితీ హక్కులతో ఇస్తామని ప్రభుత్వం పేర్కొందన్నారు. మూడేళ్లు కావస్తున్నా భూమిని అప్పగించలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.

'ట్రస్ట్ బోర్డు' ఉత్తర్వులపై హర్షం

అనకాపల్లిటౌన్ : నూకాంబిక ఆలయ ట్రస్టు బోర్డు నియామకంపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు పబ్లిక్ ఫోరం రాష్ట్ర కో ఆర్డినేటర్, సమాచార హక్కు, వినియోగదారుల రక్షణ చట్టాల ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలతో వీలైనంత వేగంగా అధికారిక ఉత్తర్వులను వెల్లడించాలన్నారు. ట్రస్టు సభ్యుల సంఖ్య, అర్హతలు, రిజర్వేషన్లు, దరఖాస్తు నమూనా, చిరునామా తదితర వివరాలతో పూర్తిస్థాయిలో ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు.

అకాల వర్షాలతో రైతులకు నష్టం

తుమ్మపాల : అకాల వర్షాలతో నష్టపోతున్న రైతుల ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టి సారించాలని వ్యవసాయదార్ల సంఘం ఉపాధ్యక్షుడు విల్లూరి పైడారావు కోరారు. ఆయన నివాసంలో గురువారం జరిగిన ప్రజా సంఘాల ఐక్య వేదిక సమావేశంలో మాట్లాడుతూ పంట కాల్వలను తక్షణమే బాగుచేసి, పూడికను తొలగించాలన్నారు. గ్రోయిన్స్ పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలన్నారు. పట్టణ పరిధిలో ఐదు వందల ఎకరాలకు పైగా వాణిజ్య పంటల నష్టం కలిగిందని, నువ్వులు, టమాటా, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న రైతులు పూర్తిగా నష్టపోయారని తెలిపారు. వారికి నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు బొట్టా చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజు పాల్గొన్నారు.


మూలపేటలో ఫ్యామిలీ డాక్టర్



వైద్యసేవలందిస్తున్న మునగపాక పీహెచ్‌సీ సిబ్బంది

మునగపాక(అనకాపల్లి): సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యుడు అనిల్ కుమార్ అన్నారు. మూలపేటలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా గ్రామాలకు వైద్య సేవలు మరింత విస్తరించాయన్నారు. ప్రస్తుత వేసవిలో బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

అభినందన సభ విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ అప్పారావు

సబ్బవరం: వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా పాలిశెట్టి సురేష్‌రాజ్ ప్రమాణ స్వీకారోత్సవం అభినందన సభను విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరిపాక పంచాయతీ శివారు లగిశెట్టిపాలెంకు చెందిన పాలిశెట్టి సురేష్ రాజ్‌ను వైఎస్సార్‌సీపీ అధిష్టానం అనకాపల్లి జిల్లా యువజన విభాగం అధ్యక్షునిగా నియమించిందన్నారు. ప్రమాణ స్వీకారం సందర్భంగా 30న బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించే సభలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పాల్గొనే అవకాశం ఉందన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి హాజరవుతారన్నారు. సమావేశంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, పాలిశెట్టి సురేష్ రాజ్, కర్రిబాబు, బోకం రామునాయుడు, నారాయణమూర్తి, శరగడం రాము, అచ్చెంనాయుడు, మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

ఎంపీ నిధులు రూ.22 లక్షలు మంజూరు

- వేసవి కార్యాచరణ, శ్మశానాల్లో వసతుల పెంపు

కశింకోట : మండల గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణ, శ్మశానాల్లో సదుపాయాలు మెరుగుపరిచేందుకు రూ.22 లక్షల నిధులను తన ఎంపీ కోటా నుంచి మంజూరు చేసినట్లు ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయల కల్పన కోసం ఎంపీ కోటా నిధులు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. మంజూరు చేసిన నిధులతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా బోర్ల ఏర్పాటుకు రూ.13 లక్షలు కేటాయించామన్నారు. శ్మశాన వాటికల్లో వసతుల మెరుగుకు రూ.9 లక్షలు మంజూరు చేశామన్నారు. ఈ నిధులతో అడ్డాం, పేరంటాలపాలెం, జోగారావుపేట, నాయుడుపాలెం, ఏఎస్ పేట, జమాదులపాలెం, తేగాడ, లాలంకొత్తూరు శ్మశానాల్లో బోర్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. త్వరలో షెడ్లు, ప్రహరీలు, ప్లాట్ ఫారాల నిర్మాణానికి కూడా నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీపీ కలగా లక్ష్మిల సూచనల మేరకు ఈ నిధులను మంజూరు చేశామన్నారు. ఇతర మండలాల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ఎంపీ నిధులు కేటాయించడానికి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

స్వల్పంగా తగ్గిన కూరగాయల ధరలు



కశింకోట వారపు సంతలో ఎండ తీవ్రతతో వెలవెలబోతున్న దుకాణాలు

కశింకోట : కశింకోటలో సూర్య తాపంతో గురువారం ప్రజలు విలవిలలాడారు. గత కొద్ది రోజులుగా కాస్త తగ్గిన ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. దీంతో ఇక్కడి వారపు సంత వెలవెలబోయింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రతతో కొనుగోలుదారులు లేక దుకాణాలు ఖాళీగా కనిపించాయి. ఎండ వేడిమితో సరైన నీడ లేక దుకాణదారులు ఇబ్బందిపడ్డారు. సాయంత్రం వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. కొనుగోలుదారుల రాకతో దుకాణాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. కూరగాయల ధరలు కాస్త తగ్గాయి. టమాటా కిలో రూ.10కి విక్రయాలు సాగాయి. గత వారం వరకు నాణ్యతను అనుసరించి రూ.15 నుంచి రూ.20 ఉండేది. ఈ వారం రూ.10కి తగ్గింది. ఉల్లిపాయలు, బంగాళాదుంపలు రూ.20, వంకాయలు రూ.30, బీట్‌రూట్, క్యారెట్, బెండకాయ, దొండకాయ రూ.40, కాకరకాయ రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి. పచ్చి మామిడి కాయ ఒక్కొక్కటి రూ.10కి విక్రయించారు.

అంగన్‌వాడీల్లో సమయపాలన తప్పనిసరి



కశింకోటలో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి



సమావేశానికి హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

- ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి

కశింకోట : అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు సమయ పాలన పాటించాలని ఐసీడీఎస్ సీడీపీవో పి.ప్రభావతి సూచించారు. కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను తప్పనిసరిగా ఉదయం 8 గంటలకు తెరవాలన్నారు. మధ్యాహ్నం 3 గంటల వరకు విధులు నిర్వర్తించాల్సిందేనన్నారు. వివాదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. వేసవి దృష్ట్యా పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. భోజన విరామ సమయం తర్వాత రికార్డుల నమోదు పని పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు నివారణకు కృషి చేయాలని పేర్కొన్నారు. శ్రీలత స్థానంలో విశాఖ నుంచి బదిలీపై వచ్చిన ప్రభావతి తొలుత అంగన్‌వాడీ కార్యకర్తలను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఆమెకు సంఘం జిల్లా అధ్యక్షురాలు మజ్జి నాగేషు నివేదించారు. తమ విధులను మధ్యాహ్నం ఒంటి గంటకు పరిమితం చేయాలని, ప్రభుత్వ సెలవు దినాలను తమకు కూడా పూర్తిగా వర్తింపజేయాలని ఆ వినతి పత్రంలో కోరారు.

'రోగులకు మెరుగైన సేవలందించండి'



తగరంపూడి ఆస్పత్రిలో వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్ : ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు కోరారు. మండలంలోని తగరంపూడి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వైద్యులు, సిబ్బంది సేవలందించాలని సూచించారు. ఆస్పత్రి వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అంతకుముందు జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. ఆస్పత్రి ఆవరణ లోతుగా ఉండటం వలన వర్షం కురిసినపుడు నీరు నిలిచిపోయి బురదమయంగా మారుతోందని, దీని పరిష్కారానికి ఆవరణలో మట్టి వేసి ఎత్తుగా చేయాలని నిర్ణయించారు. ఆస్పత్రిలో చెదల నివారణకు పెస్ట్ కంట్రోల్ ట్రీట్మెంట్ చేయించాలని, రోగుల గదికి శీతలీకరణ సౌకర్యం, దోమలు రాకుండా కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో ఎంపీడీవో కె.ధర్మారావు, వైద్యుడు రమేష్ నాయుడు, తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు, సీతానగరం సర్పంచ్ సుంకర చంటిబాబు, జంపన శివాజీ వర్మ, అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు

- ఏయూ తెలుగు విభాగ ప్రొఫెసర్ బూసి వెంకటస్వామి
- 'పిల్లలు రాసిన కళింగ జానపద కథలు' పుస్తకావిష్కరణ



సమన్వయ అధికారి రూపావతితో కలిసి పుస్తకాన్ని అవిష్కరిస్తున్న బూసి వెంకటస్వామి

సబ్బవరం : పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంచుకుని అందులోని నైతిక విలువలను అలవరుచుకోవాలని ఏయూ తెలుగు విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బూసి వెంకటస్వామి సూచించారు. సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం జూనియర్ అధ్యాపకుడు బద్రి కూర్మారావు రచించిన 'పిల్లలు రాసిన కళింగ జానపద కథలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. గురుకులం ప్రిన్సిపాల్ విజయకుమార్ ఆధ్వర్యంలో గురుకులం పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి ఎస్.రూపావతితో కలిసి బూసి వెంకటస్వామి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికత బాగా విస్తరిస్తున్న ఈ ఆధునిక కాలంలో అమ్మమ్మ, తాతయ్యలు చెప్పిన కథలు విని తమ బాల్యాన్ని మలుచుకునే సంస్కృతి నానాటికీ కనుమరుగవుతోందన్నారు. బద్రి కూర్మారావు మరుగునపడిన కథలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేసి సఫలం కావడంపై బూసి ప్రశంసించారు. సెల్‌ఫోన్‌లు, టీవీలకు అతుక్కుపోతున్న పసి తనం ఈ కథలు చదివి వారిలోని ఆలోచన దృక్పథాన్ని పెంపొందించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగడానికి ఈ పుస్తకం దోహదపడుతుందన్నారు.

సమన్వయాధికారి రూపావతి మాట్లాడుతూ పిల్లల్లో ఆలోచన, సృజనాత్మకత పెంపొందించడానికి ఇలాంటి కథల పుస్తకాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ దిశగా మరింత కృషి జరగాలని అభిలషించారు.